విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 11, ఏప్రిల్ 2025

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన గుడాల సోదరులు

విశాలాంధ్ర-అవుకు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కంబగిరి స్వామి ఆలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న స్వామి వారి కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టిడిపి సీనియర్ నాయకులు గూడాల మురళీధర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డిలు గురువారం పరిశీలించారు. ఆలయ అధికారులు,అర్చకులు గూడాల సోదరులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.వేసవి దృష్ట్యా ముఖ్యంగా నీటి సమస్య లేకుండా తగినన్ని నీటి కొళాయిలను ఏర్పాటు చేశారు.విద్యుత్తు సమస్య లేకుండా విద్యుత్ అధికారులతో మాట్లాడారు. అనంతరం సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్సై రాజారెడ్డిలతో కలిసి వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు.ఆలయ ఇన్చార్జి ఈవో రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు,కుసుకుంట్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ప్రాంతం నుండి యువత తరలి వచ్చి తిరుపతిలో జరగబోయే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్లను జిల్లా కార్యదర్శి ఎస్ రంగరాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మే 15నుండి 18వరకు తిరుపతిలో మొదటిసారిగా ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు జరగ బోతున్నాయని, ఈ మహా సభలు చాలా ప్రాధాన్యతతో కూడుకున్నవని, దేశంలోని 29 రాష్ట్రాల నుండి యువ జన సమాఖ్య ప్రతినిధులు వస్తున్నారని, వేలాది మంది యువత తిరుపతి నగరంలో జరిగే భారీ ర్యాలీలో కదం తొక్కబోతున్నారని, సుమారు వెయ్యి మంది ప్రతినిధు లతో మూడు రోజులపాటు ఈ మహాసభలు జరుగుతా యన్నారు. దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అశా ంతి, ప్రాంతీయ, మత తత్వ విధానాలు, జాతీయ విద్యా విధానం, ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, భవిషత్ కార్యాచరణను రూపొందించు కోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, పట్టణ అధ్యక్షులు రవికుమార్, సహాయ కార్యదర్శి మధు పాములేటి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు సవరణ రద్దు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - నందికొట్కూరు : లౌకిక విలువలను, మైనార్టీల హక్కులను కాలరాస్తున్న వక్ఫ్ బిల్లు సవరణ రద్దు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురాం మూర్తి అన్నారు. గురువారం నందికొట్కూర్ పట్టణంలో స్థానిక పాత బస్టాండ్ నందు గల జైకిసాన్ పార్కు నుండి ర్యాలీగా బయలుదేరి పటేల్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 25, 29, 30 తదితర నిబంధనకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని, మసీదులు, దర్గాలు, స్మశానం స్థలాలు, పాఠశాలలు, హాస్పిటల్స్, కళాశాలలు, గ్రంథాలయాలు, ఉపాధి శిక్షణ కేంద్రాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడతాయన్నారు. ఇతర మతాలవారు వక్ఫ్ బోర్డులో సభ్యుల్లో చేర్చి వాటిని వివాదాస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉన్నదన్నారు. ఇది భారతదేశ ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగా చేయబడిందని దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించి ప్రతిఘటించాలని కోరారు. ఏఐటియుసి నాయకులు మజీద్ మియా, రహిమాన్, మహ్మద్మియా, రఫీ,ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రజిత, కాంగ్రెస్ పార్టీ మహిళా ఇన్చార్జి షాజహాన్ బేగం, మహిళ సమాఖ్య సభ్యులు స్వర్ణలత, రూప, స్వాతి, నందికొట్కూర్, వడ్డేమాన్, బ్రాహ్మణ కొట్కూర్, పాతకోట గ్రామాలకు సంబంధించి ముస్లిం మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష వాయిదా

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : 2025-26 విద్యా సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలోకి ప్రవేశ పరీక్ష 21న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించినట్లుగా 20న నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్ష 21వ తేదీకి ప్రభుత్వం మార్చినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మోడల్ స్కూల్ నందు నిర్వహించే ప్రవేశ పరీక్షకు 20వ తేదీన ఈస్టర్ పండుగ ఉన్నందున ప్రభుత్వం ప్రవేశ పరీక్షని 21కి మార్చిందని మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి తేదీ మార్పును గమనించాలని తెలిపారు. 21 సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నందు ఉదయం 10గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

మొక్కజొన్న పంట పరిశీలించిన శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల కేంద్రమైన నందికొట్కూరుకు చెందిన చిన్న జమాలు వలి వేసినటువంటి మొక్కజొన్న పంటను గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా.ఎ.రామకృష్ణా రావ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.సుజాతమ్మ, కోఆర్డినేటర్, కె.వి.రమణమ్మ, డా.ఇ.వెంకట రమణ, ఏవో షేక్ షావలి, ఎం.పి.ఇ.ఓ.సలాం సంయుక్తంగా కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతు మొక్కజొన్న పంటను రబి పంట కాలంలో డిసెంబర్ 25న మొక్కజొన్న రకం లెజెండ్ సోనం సీడ్స్ సాగు చేసి నట్లు నగదు బిల్లు ఆధారంగా శాస్త్రవేత్తలు తెలుసుకొన్నారు. రైతులు మొక్కజొన్న పంటను ఏకపంటగా కాకుండా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పంట మార్పిడి చేసుకోవాలని రైతులకు శాస్త్రవేత్తలు సూచించారు.

పెంచిన ధరలు తగ్గించాలి : సీపీఐ

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ అధ్యక్షతన గురువారం నంద్యాల పట్టణం సంజీవ నగర్ గేటులో ఉన్న పెట్రోల్ బంకు దగ్గర ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా కూడా భారతదేశంలో పెరిగే ధరలను అదుపు చేయలేకపోయిన కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని అన్నారు. ఈ పెంపు సామాన్య మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చిందని అన్నారు. సిలిండర్ 825రూపాయలు ఉంటే 875రూపాయలు పెంచడం జరిగిందనీ, డీజిల్ పెట్రోల్ పైన రెండు రూపాయలు పెంచారని ఆరోపించారు. రాష్ట్రంలో ధరలు పెరగకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వమైన చంద్రబాబు నాయుడుపై ఉందని వెంటనే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, గోస్పాడు మండల సిపిఐ కార్యదర్శి హరినాథ్. సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, సిపిఐ నాయకులు చాంద్ భాషా, సుబ్బరాయుడు, కరీం.దానం, సిద్ధిక్, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, మహిళా సమైక్య నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభసాటి

విశాలాంధ్ర-అవుకు : రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఎంతో లాభసాటిగా ఉండడమే కాకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆహార పదార్థాలుగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ప్రణాళికపై సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, హార్టికల్చర్ అధికారి రఘురాం, ప్రకృతి వ్యవసాయ ఎస్ ఎఫ్ ఏ రామకృష్ణ, వెలుగు ఏపిఎం చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో ఎక్కువగా రసాయన మందులు, పురుగుల మందులు వినియోగిస్తున్నారని తద్వారా ఆహార ధాన్యాలు కూరగాయలు, భూమి కలుషితం అవడం వలన మానవాళి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించేందుకు రైతులకు తగిన ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సుబ్బరాయుడు, వ్యవసాయ సిబ్బంది, రైతు సేవ కేంద్రం సిబ్బంది, వెలుగు సీసీలు, వ్యవసాయ సహాయకులు, స్వయం సహాయక సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. గురువారం నంద్యాల పట్టణం పిఎస్సి కెవిఎస్సి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి ప్రారంభించారు. ఫరూక్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు. ఈజాబ్ మేళాలో 14పేరెన్నిక కంపెనీలో పాల్గొని దాదాపు 589కు పైగా ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. నిరుద్యోగ యువత నిరుత్సాహపడకుండా ప్రతినెల జాబ్ మేళాను నిర్వహిస్తామని, ఆసక్తిగల నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణను పెంపొందించుకోవాలన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఆసక్తికర రంగాలలో నైపుణ్యం గల శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కంపెనీల యాజమాన్యాలతో పాటు డిఎస్డిఓ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సోమశివారెడ్డి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జెకెసి కోఆర్డినేటర్ పార్వతి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోట్లు కొల్లగొట్టిన ఘనుడు

- వెలుగోడులో వెలుగుచూసిన భారీ కుంభకోణం
- ఇతరుల పేర్లతో రుణాల ద్వారా సైబర్ క్రైమ్
- 5నుంచి 12కోట్ల వరకు మోసం జరిగినట్లు అంచనా

విశాలాంధ్ర - వెలుగోడు : రాష్ట్రంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌ల లాగే మరో భారీ కుంభకోణం వెలుగోడు పట్టణంలో జరిగింది. ఒక వ్యక్తి తనకు తెలిసిన స్నేహితుల పేర్లతో బంధువుల పేర్లతో భారీగా రుణాలను, వివిధ బ్యాంకులలో తీసుకొని భారీ కుంభకోణానికి పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. బ్యాంకుల నుంచి బాధితులకు మీ పేరు మీదుగా లోన్ ఉంది ఎందుకు కట్టడం లేదని ఫోన్లు రావడంతో బాధితులు మోసం జరిగినట్లు భావించి లబోదిబోమంటూ వెలుగోడు పోలీస్ స్టేషన్ను ఆశ్రయించగా, ఇక్కడ ఎస్సై లేనందున ఆత్మకూరు సిఐ దగ్గరికి వెళ్ళమని స్థానిక పోలీసులు బాధితులకు సూచించారు. వెలుగోడు పట్టణానికి చెందిన ఒక వ్యక్తి తన స్నేహితులు, బంధువుల ఆధార్ కార్డులను తీసుకొని వాటి ద్వారా కొత్త సిమ్ములను సృష్టించి, పాన్ కార్డులు, ఏటీఎం కార్డులు తయారు చేసుకొని ,పలు బ్యాంకుల నుంచి ఒక్కొక్క వ్యక్తి పేరు మీదుగా 2లక్షల నుంచి పది లక్షల వరకు రుణాలు తీసుకొని మోసం చేసిన సంఘటన జరిగింది. ఈ విధంగా మోసపోయిన వారిలో వెలుగోడు కు చెందిన వారు సుమారు 50 నుంచి 100 మంది వరకు ఉండవచ్చని, ఆత్మకూరు పట్టణానికి చెందిన బాధితులు కూడా కొందరు ఉన్నారని విశ్వసనీయంగా తెలిసింది. మోసం చేసిన వ్యక్తి వెలుగోడు పట్టణంలో రూ.70లక్షలకు పైగా ఖర్చుపెట్టి ఇంటి నిర్మాణాన్ని చేపట్టినట్టు , రెండు కార్లను కొనుగోలు చేసినాడు అని , సుమారు కోటి రూపాయల వరకు వడ్డీలకు ఇచ్చినట్లుగా, మరో కోటి రూపాయలతో తన అప్పులను తీర్చినట్లుగా ప్రజల ద్వారా తెలిసింది. ఈ భారీ కుంభకోణంలో బ్యాంకు సిబ్బంది హస్తము కూడా ఉండవచ్చని విశ్వసనీయ సమాచారం. ఇంత భారీగా కుంభకోణం జరిగిన సంఘటనపై పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో మోసం చేసిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. బాధితులు ఫిర్యాదుచేయాడికి ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కి వెళ్లగా సీఐ కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

రెండో శనివారం సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో సేవలు

విశాలాంధ్ర - అవుకు : రెండవ శనివారం సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో సేవలు అందుబాటులో ఉంటాయని అవుకు సబ్ రిజిస్టర్ రాముడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలోని అవుకు, సంజామల, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరమ్మ, అటెండర్ పార్వతి, సిబ్బంది విశ్వనాథ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఉచిత క్రీడల శిక్షణ

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : పట్టణంలోని కేవీకే స్టేడియంలో క్రీడాకారులకు ఉచిత శిక్షణలు ఇస్తున్నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఖోఖో అసోసియేషన్ ఏర్పాటైన సందర్భంగా ఖోఖో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు టైగర్ బాబు ఆధ్వర్యంలో స్టేడియంలోని క్రీడాకారులకు పండ్లను పంచిపెట్టారు. త్వరలో నిర్వహించబోయే వేసవి శిక్షణ శిబిరాలను శ్రీశైలం నియోజకవర్గ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో శిక్షణ నేర్చుకొనే క్రీడాకారులకు భోజన వసతి, హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. ఈ క్రీడలకు నిర్వాహకులుగా ఆత్మకూరు వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ నిమ్మి కృష్ణ యాదవ్, ఆత్మకూరు స్టేడియం ఇంఛార్జి జునైద్ బాషా ఉంటారు. ఆత్మకూరు స్టేడియంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డి, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, తైక్వాండో, బాక్సింగ్, క్రికెట్, ఫుడ్ బాల్ క్రీడలు నిర్వహిస్తున్నామని ఆసక్తి కలవారు 9391979003 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

రైతులకు మెరుగైన సౌకర్యాలు అందించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సహకార అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా సహకార సమన్వయ అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య, నాబార్డ్ డిఎం సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా, మత్స్యశాఖ అధికారి రాఘవరెడ్డి, పశు సంవర్ధక అధికారి గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 56ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకుగాను 51సంఘాలలో కంప్యూటీకరణ పూర్తయిందని, రైతులకు మరిన్ని సేవలందించేందుకు సహకార అధికారులు, కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు సహకరించాలని ఆదేశించారు. మిగిలిన ఐదు పరపతి సంఘాలు వారం రోజులలో కంప్యూటీకరణ పూర్తి చేసి స్వాధీనం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు. ఆరు పరపతి సంఘాలకు సంబంధించిన గోడౌన్లను వరల్డ్ లార్జెస్ట్ గ్రైన్ స్టోరేజ్ యూనిట్‌గా మార్పు చేసేందుకు కమిటీ సభ్యులు అంగీకరించారని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా స్వాధీనం చేసిన 56 వ్యవసాయ పరపతి సంఘాలను రైతులకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు వినియోగపడే విధంగా తీసుకొని వస్తే రైతాంగానికి మేలు చేసిన వారమవుతామని కలెక్టర్ తెలిపారు. పరపతి సంఘాల ద్వారా డ్రోన్ ల కొనుగోలుకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

అనారోగ్యంతో బైరాపురం సర్పంచ్ మృతి

విశాలాంధ్ర - మిడుతూరు : మండల పరిధిలోని బైరాపురం గ్రామ సర్పంచ్ ఫణి భూషణ్ రెడ్డి అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందడం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు ఊపిరితిత్తుల వ్యాధి ఉండటంవల్ల చికిత్స నిమిత్తం గత కొన్ని రోజుల క్రిందట హైదరాబాదులోని ఏఐజి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఉండడం జరిగిందనీ అయితే బుధవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో చికిత్స కోలుకోలేక మృతి చెందారన్నారు. సర్పంచ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈయన గ్రామంలోని ప్రజా సమస్యలపై నిరంతరం అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామ అభివృద్ధికి కృషి చేసేవారు.

నేడు శివ భాష్యం గౌడ్ వర్ధంతి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని కొట్టాల చెరువు గ్రామ సమీపంలో నల్లమలలో ఉన్నటువంటి వరదరాజు స్వామి ప్రాజెక్టు సృష్టి కర్త శివబాష్యం గౌడ్ వర్ధంతి సందర్భంగా నేడు కుటుంభ సభ్యులు చుట్టుప్రక్కల గ్రామాల రైతులు నేడు శుక్రవారం అయన వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తునట్టు కుటుంభ సభ్యులు తెలిపారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని బీసీ ఇందిరారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 44వ వార్షికోత్సవ వేడుకలకు బిసి ఇందిరారెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బిసి ఇందిరా రెడ్డి పాఠశాలకు చేరుకోగానే నెహ్రూ విద్యాసంస్థల అధినేత కోడూరు హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారులు అకడమిక్ డైరెక్టర్ కోడూరు కమల్ తేజా రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కోడూరు రవితేజా రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ఎటువంటి చెడు అలవాట్లకు లోను కాకుండా, క్రమ శిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని, ఇటు తల్లిదండ్రులకు, అటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రవర్తలను బట్టి విద్యార్థుల నడవడిక ఉంటుందని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆదర్శంగా నడుచుకోవాలని అన్నారు. విలువైనదని, చిన్న చిన్న తప్పులు చేసి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కె.మురళి, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు రక్షణ

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : కార్డులతో టీడీపీ కార్యకర్తలకు అన్ని విధాల రక్షణ ఉంటుందని గ్రామ సర్పంచ్ మాధవరం ప్రకాశం అన్నారు. గురువారం మండలంలోని పారుమంచాల గ్రామంలో టీడిపి సభ్యత్వ కార్డులను ఆయన కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాధవరం దేవ సహాయం, విద్య కమిటీ చైర్మన్ కలిముల్లా, గులకన్నా బూత్ ఇంచార్జి మేరిజన్, చిన్న చింతలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడు మృతి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కోళ్ల వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. వెంకటేశ్వర్లు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య గురువారం తరిగొప్పుల గ్రామానికి చేరుకొని ఆయన పార్దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ వెంకటేశ్వర్లు అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు అనంతరం వారి కుటుంబ సభ్యు లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మందడి నారాయణరెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వర్ రెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, మాజీ ఎంపీటీసీ కాంతు, నాగేశ్వరరావు రాజశేఖర్ గౌడ్, శీను తదితరులు పాల్గొన్నారు.

మసీదుల ముతవల్లిలు సస్పెండ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఉత్తర్వుల మేరకు నంద్యాల పట్టణంలోని చౌక్ మసీదు, దానికి అనుబంధమైన బాలాజీ కాంప్లెక్స్ లతీఫియా మసీదును జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్ పెక్టర్ తమ అధీనంలోకి తీసుకున్నారు. గురువారం ఆ మసీదుల ముతవల్లిలయన పి.ఇమ్రాన్, జావిద్‌లను రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు సస్పెండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, జిల్లా ఇన్స్ పెక్టర్లు ఇమ్రాన్, వక్ఫ్ బోర్డు విజయవాడకు చెందిన మురాద్ అన్సారీ, అల్తాఫ్ హుస్సేన్, ముస్లిం మత పెద్ద మనియార్ ఖలీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిణి సబీహా పర్వీన్ మాట్లాడుతూ ఇప్పటినుండి చౌక్ మసీదు, బాలాజీ కాంప్లెక్స్ నందలి లతీఫియా మసీదు తమ ఆధీనంలో ఉంటాయాని వివరించారు.

విత్తన శుద్ధి కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: నంద్యాల మండలంలోని విత్తన శుద్ధి కేంద్రాలను అధికారులు తనిఖీ చేసినట్లు నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. గురువారం నంద్యాల మండలంలోని జిల్లా వ్యవసాయ శాఖకమిషనర్ అధికారి, వై.వి.మురళి కృష్ణ, చైర్మన్ శ్రీనివాసచార్యులు, శివరామకృష్ణ, ఏడి.రాజశేఖర్ ఆధ్వర్యంలో మండలంలో గల ప్రతి విత్తన శుద్ధి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణ లక్ష్మి సీడ్స్, వినాయక అగ్రో ఇండస్ట్రీస్, హరినాథ్ క్రాప్ జనిసిస్, భవ్య సీడ్స్, బబ్బూరి అగ్రో ఇండస్ట్రీస్, శ్రీ వెంకటేశ్వర సీడ్స్, శ్రీశ్రీ భారతీ సీడ్స్, న్యూ వెంకటేశ్వర సీడ్స్ విత్తన శుద్ధి కేంద్రాలలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించమన్నారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని అలాగే విత్తన శుద్ధి చేసే ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణా మండలి నుండి అనుమతులు పొంది వుండాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. వీరి వెంట మని మోహన్ రెడ్డి, వ్యవసాయ సహాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినూత్న పద్ధతిలో మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వినూత్న పద్ధతిలో సుమారు 250మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ సైన్ బోర్డ్స్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉన్న పోస్టర్ల ద్వారా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. గురువారం ఓమ్ని హాస్పిటల్, రాయలసీమ ఎక్స్ ప్రెస్ వే, పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఆర్ కే ఫంక్షన్ హాల్ నందు ఆటో డ్రైవర్లకు, లారీ యూనియన్ కు సంబంధించిన డ్రైవర్లు, వివిధ స్కూల్ బస్సులు ఆటోల డ్రైవర్లకు, పోలీస్ సిబ్బందికి, ఇతరులకు ఉచితంగా వైద్య పరీక్షలు బిపి, షుగర్, ఈసీజీ, 2డి ఎకో, కంటి చూపుకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అత్యాశకు వెళ్లి ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయడం ద్వారా ప్రమాదాల బారిన పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా, ఓమ్ని హాస్పిటల్, పుష్పగిరి హాస్పిటల్ దాక్టర్లు, వారి వైద్య బృందం, రాయలసీమ ఎక్స్ ప్రెస్ వే అధికారులు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

90వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు: రైతు సంఘం 90వ ఆవిర్భావ దినోత్సవం ను జయప్రదం చెయ్యాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాధం పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్ నందు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపనగౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 1936 ఏప్రిల్ 11న ఏర్పడిందని, అప్పుడు జాతీయ అధ్యక్షులుగా సహజానంద సరస్వతి ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎన్జీరంగా ఉన్నారని, అప్పట్లో అఖిలభారత రైతు సంఘం మన భారత దేశంలో దున్నేవాడికి భూమి హక్కు కావాలని ఎన్నో పోరాటాలు నిర్వహించి భూమిలేని నిరుపేదలకు భూములు పంచడం జరిగిందన్నారు. దేశంలోని ప్రైవేట్ బ్యాంకులన్నీ జాతీయ చేయడం జరిగిందని, భూమి ఉన్న ప్రతి రైతుకు పంట రుణాలు ఇవ్వడం రైతులందరికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దేశవ్యాప్తంగా పోరాటాలు చేయడం వల్లనే వ్యవసాయానికి సాగునీరు గ్రామాలకు తాగునీర, సాగునీటి ప్రాజెక్టులు కొంతవరకు సాధించడం జరిగిందన్నారు. ప్రస్తుతం దేశంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందని, వ్యవసాయం గిట్టుబాటుగాక రైతులు వ్యవసాయాన్ని వదిలి వలస కూలీలుగా మారుతున్నారన్నారు. సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి చింతల మహేష్, రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: మే 15 నుండి 18 వరకు తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్‌లు పిలుపునిచ్చారు. స్థానిక లెనిన్ భవన్ నందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా బి.గిడ్డయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింద న్నారు. అధికారం చేపట్టి 11 సంవత్సరాలు గడుస్తున్నా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువతను మతం పేరుతో రెచ్చగొడుతూ పేడదవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల కల్పన చేయకపోగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బీఎస్ఎన్ఎల్, రైల్వే, బ్యాంకింగ్, ఎయిర్ పోర్ట్, పోర్టులు ప్రవేట్ కంపెనీలకు అప్పనంగా అప్పజెప్తో ఉన్న ఉద్యోగాలు కూడ కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి వెయ్యి మంది ప్రతినిధులతో ప్రతినిధుల మహాసభలో దేశ వ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చించి, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి మహా సభలు వేదిక కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షలు శ్రీరాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రంగన్న, జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్, ఏఐటీయూసీ నాయకులు తిమ్మ గురుడు, వీరేష్, విజేంద్ర, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న నగరంలోని టౌన్ మోడల్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న నూతన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజును కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న ఆహ్వానించారు. గురువారం విద్యాశాఖ ఈఈ నాగరాజుతో కలిసి ఎంపీ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసిన ప్రిన్సిపల్ సుంకన్న ఆహ్వాన పత్రికను బస్తిపాటి నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు కళాశాలలోని పలు అంశాలపై ప్రిన్సిపాల్‌తో చర్చించారు.

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంలోని ఉన్న ఆదర్శ పాఠశాలలో జరగవలసిన పరీక్ష తేదీని మార్చడం జరిగింది. ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కొరకు ఈనెల 20వ తేదీన జరగవలసిన ప్రవేశ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వంశ మోహన్ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీన జరగవలసిన పరీక్ష ఈస్టర్ పండుగ సందర్భంగా వాయిదా వేసి 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఎస్సీ కులముల వారి 2025–26 ఆర్థిక సంవత్సరమునకు గాను బ్యాంకు రుణం అనుసంధానంతో సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి పథకాలు ఈ నెల 14 నుంచి మే నెల పదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి గురువారం తెలిపారు. జిల్లాకు కేటాయించిన సబ్సిడీ మండలం, మున్సిపాలిటీ, బ్యాంకు బ్రాంచ్ వారిగా ఆమోదించడం జరిగిందని ఆమె తెలిపారు. బ్యాంక్ సబ్సిడీ నియమా నిబంధనల ప్రకారం యూనిట్ గ్రౌండ్ చేయబడుతుందని, 21 నుంచి 50 ఏళ్లు ఉన్న వారందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఈవ్ టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడే వారిపై జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పోలీసు అధికారులు హెచ్చరించారు. గురువారం జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల వద్ద యాంటీ ఈవ్ టీజింగ్ బీట్‌లను తనిఖీ చేస్తున్నారు. ఈవ్ టీజింగ్, ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు అవగాహన చేస్తున్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాంటీ ఈవ్ టీజింగ్‌ను అరికట్టాలనే ఉద్దేశ్యంతో జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్ బీట్స్‌ను కొత్తగా అమలులోకి తీసుకొచ్చారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని ఎ.క్యాంప్ నందున్న మైపర్ ఫార్మసీ కళాశాల యందు గురువారం క్యాంపస్ డ్రైవ్ జరిగినది. ఇందులో కోరో హెల్త్ బెంగళూరు వారు వివిధ ఇంటర్వ్యూలు నిర్వహించి, విద్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. ఎంపికైన విద్యార్థులను ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాసర్ల సురేష్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ రాజ్ కుమార్, రఘువీర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - సి.బెళగల్: స్థానిక కస్తూర్బా పాఠశాలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ పాషా తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన విద్యార్థులతో పాఠశాలలో ఉన్న వసతులపై ఆయన ఆరా తీశారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం మీకు భోజనం రుచికరంగా అందిస్తున్నారా అని ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ అన్నారు.

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుంద బస్టాండులో చలివేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు గురువారం డిమాండ్ చేశారు. వేసవి ఎండలు విపరీతంగా ఉండడంతో నీటి సమస్య ఏర్పడిందని, నీటి దాహం తీర్చుకోవడానికి హోటల్లు, కూల్ డ్రింక్ షాపులను ఆశ్రయించి మంచినీటిని పొందుతున్నామని ప్రజలు అంటున్నారు. మంచినీటి దాహం తీర్చుకోవడానికి వాటర్ బాటిళ్లు, వాటర్ పాకెట్లను డబ్బులు చెల్లించి తీసుకుంటున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులకు మంచినీరు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, విద్యావంత యువకులు వాపోయారు. చలివేంద్రం ఏర్పాటు కోసం సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మంచి నీరు అందుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

విశాలాంధ్ర - నందవరం: 1967 సంవత్సరంలో జాతీయ కాన్ఫరెన్స్ నందు సిఫార్సుతో ప్రతి రాష్ట్రంలో సర్వే శాఖ ఏప్రిల్ 10న భారతదేశం అంతట జాతీయ సర్వే దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కె.శ్రీనివాసులు అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, సర్వే దినోత్సవాన్ని ఘనంగా చేసుకున్నారు. సర్వే విశిష్టతను ప్రతి సర్వేయర్ తెలుసుకోవాల్సి వుందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీలు శశిధర్ స్వామి, మహేష్, మండల సర్వేయర్ అక్బర్ బాష, ఆర్ఐ సుబ్బారెడ్డి, సర్వయర్లు శేఖర్, మల్లికార్జున గౌడ్, చంద్రశేఖర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో కూడళ్లపై, డివైడర్లపై, ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు, బ్యానర్లు అతికిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కూడళ్లలపై, డివైడర్ల మధ్యలోని స్తంభాలపై, గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికించడం వల్ల, అవి నగర అందాన్ని చెడగొడుతున్నాయన్నారు. ఎవరైనా అతిక్రమించి నగర సుందరీకరణకు ఆటంకం కలిగిస్తే, వారిపై మున్సిపల్ చట్టం 1955, సెక్షన్ 163, 164 ప్రకారం లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, దయాల్ బాగ్ రాధాస్వామి సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని న్యాయ సేవ సదన్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి జి.కబర్ది, ఇతర న్యాయాధికారులు హాజరయ్యారు. జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ హోమియో వైద్యం ఉత్తమమైనదిగా అభివర్ణించారు.

విశాలాంధ్ర-హొళగుంద: సాయిబన్న దాదా ఉరుసు మహోత్సవం 14 గంధం, 15న ఉర్సు, 16తేదీన జియారత్ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉరుసు సందర్భంగా సర్పంచ్ చలువాదిరంగమ్మ, వార్డ్ మెంబర్ల సహకారంతో గ్రామ కార్యదర్శి రాజ శేఖర గౌడ సాయిబన్న దాదా ఆవరణం చుట్టు పెరిగిన చెత్తను తొలగించారు. ట్రాక్టర్ ద్వారా మైదానాన్ని చదును చేశారు. తాగునీటి కోసం కొత్త పైపులైన్ వేసి కొత్త కొళాయిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ మాట్లాడుతూ ఉరుసు ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

అక్రమాలకు పాల్పడుతున్న నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర - ఆదోని : కూటమి ప్రభుత్వం పేరు చెప్పి అక్రమ దందాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, వారి నుండి నియోజకవర్గ ప్రజలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు ప్రభుత్వ అధికారులకు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గ స్థాయిలో గత కొన్నేళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరింపబడతాయని గత ఎన్నికల్లో మార్పు కోసం కూటమి అభ్యర్థిని నియోజకవర్గం ప్రజలు పెద్ద ఎత్తున గెలిపించుకోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం కన్నా భిన్నమైన మార్పు కనిపించకపోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పది నెలల కాలంలో ఆదోని పరిసర ప్రాంతాల్లో నిత్యం భూకబ్జాలు, అక్రమ తరలిస్తున్నరేషన్ బియ్యం దందా, అక్రమ ఇసుక దందా, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా, ప్రభుత్వ అనుమతి లేకుండా రెడ్ గ్రావెల్ త్రవ్వకం, ప్రభుత్వ అధికారులకు తెలియకుండా యంత్రాం గాన్ని కల్లుగప్పి పట్టణంలో విచ్చలవిడిగా ఆక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసర వస్తువులలో కేవలం బియ్యం తప్ప మిగిలిన నిత్యవసర వస్తువులు పేద ప్రజలకు అందించ డంలో పూర్తిగా విఫలం చెందిందని, గత కొన్ని రోజులుగా అక్రమాలకు పాల్పడుతున్న వారి గురించి పత్రికలలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునా వృతం కాకుండా అవినీతిపరులపై చర్యలు తీసుకో వాలని కోరారు. సీపీఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావి రాజు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి టీబీ నాగరాజు, జిల్లా సమితి సభ్యులు షేక్షావలి, రైతు సంఘం జిల్లా నాయకులు మదిరె ఎల్లప్ప పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ గడువు పొడిగింపు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఆస్తి పన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త తెలిపిందని, ఆస్తి పన్నుపై 50శాతం వడ్డీ మాఫీ పొందేందుకు గడువు ఈ నెల 30 వరకు పొడిగించిందని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వడ్డీపై మాఫి నూతన సంవత్సర ప్రారంభ నెలలో సైతం వర్తింపజేయడం ఇదే మొదటిసారి అని, గురువారం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 66 జారీ చేసిందన్నారు. కాగా ఇప్పటికే నూతన సంవత్సర పన్నులను ఏక మొత్తంలో చెల్లించే వారికి 5శాతం రాయితీకి పన్నుదారుల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. గడిచిన నాలుగు రోజుల్లో ఆస్తి పన్ను, రూ.4.50 కోట్లు వసూలు అయిందని, తాగునీటి కొళాయి చార్జీలు రూ.50 లక్షలు వసూలు అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన బకాయిదారులు తక్షణమే తమ పన్నులను చెల్లించి, బకాయిలపై 50శాతం వడ్డీ రాయితీ, 2025-26వ సంవత్సర పన్నులపై 5శాతం పొందాలని అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ కోరారు.

విద్యుత్ మోటార్ బిగింపు

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని నేరణికిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న సమస్యను విశాలాంధ్ర పత్రిక ప్రకటనకు స్పందించి ఆర్డబ్ల్యూఎస్ రామ్ నీల గురువారం కొత్త విద్యుత్ మోటర్‌ను బిగించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాల్మీకి నగర్లో త్రాగునీరు లేదా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామ్ నీలా మాట్లాడుతూ వీరపాపురం ఎస్ఎస్ ట్యాంక్ నుండి తాగునీరు సరఫరా అయ్యి నేరనికి ఎస్సీ కాలనీ సంపులో పడతాయని మళ్లీ సంపు నుండి గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నీటిని సరఫరా చేసి గ్రామ ప్రజలందరికీ త్రాగునీరు సరఫరా చేస్తామని అన్నారు. కొత్త మోటర్ బిగించడం వల్ల నీటి సరఫరాకి ఎలాంటి ఇబ్బంది ఉండదని, ప్రజలకు వేసవి కాలంలో నీటి తిప్పలు లేకుండా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వన్నమ్మ, వైసీపీ నాయకుడు ఎస్.కె.సోమప్ప పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను మానుకోవాలి : ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి తనకు భద్రత సరిగా కల్పించడం లేదని చెప్పడం సిగ్గుచేటని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు ఎంపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా రాప్తాడు పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిన భద్రత సరిగా లేదని పోలీసులను విమర్శలు చేయడం సరికాదన్నారు. అసత్య ప్రచారాలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మానుకోవాలని ఎంపీ హితవుపలికారు. గత ప్రభుత్వంలో ప్రతి పక్ష నాయకులకు ఎలాంటి భద్రత కల్పించలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి పర్యటనలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తున్న జగన్మోహన్ రెడ్డి విమర్శలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకట రాముడు టీడీపీ నాయకులు వలి, దేవ శంకర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీయూ డబ్ల్యూజే నిరంతరం పోరాడు తుందని ఏపీయుడబ్ల్యూజే మండల అధ్యక్షులు బొగ్గుల సోమన్న, మండల ప్రధాన కార్యదర్శి రామన్న, తాలూకా నాయకులు బొగ్గుల ఈరన్న, జె.పుల్లయ్య స్పష్టం చేశారు. గురువారం పెద్దకడబూరులోని ప్రెస్ క్లబ్ నందు జర్నలిస్టుల సమావేశం మండల అధ్యక్షులు బొగ్గుల సోమన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఏ ఇబ్బంది వచ్చినా ఏపీయుడబ్ల్యూజే ముందుగా స్పందిస్తుందని తెలిపారు. మండలంలో పని చేసే జర్నలిస్టులకు ఏపీయూ డబ్ల్యూజే మండల కమిటీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇటివల ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన పెద్దకడబూరు పాత్రికేయుల జేబీ భీమన్నను ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ ఘనంగా సన్మానించి. మండల అధ్యక్షులు సోమన్న, ప్రధాన కార్యదర్శి రామన్న, మండల పాత్రికేయులు ఈరన్న, పుల్లయ్య, నారాయణ, ఏలియస్, మల్లికార్జున, లింగమూర్తి, శివ, రాజు ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేబీ భీమన్నను శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండల పాత్రికేయుల స్థాయి నుండి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎదగడంపై ప్రత్యేకంగా అభినందించారు.

ప్రత్యేక పూజ కార్యక్రమంలో టీజీ వెంకటేష్ దంపతులు

విశాలాంధ్ర - కర్నూలు : పవిత్ర తుంగభద్రా నది తీరంలో సంకల్ బాగ్ వద్ద ప్రజల కోసం నూతనంగా నిర్మించిన శ్రీ సీతా రాముల ఆలయంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ మహా గణపతి పూజతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టారు. నేటి నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి 12వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వేద పండితులు తెలిపారు. వరుసగా మూడు రోజులపాటు జరిగే ఈ పూజలు 12వ తేదీన జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తాయని వారు తెలిపారు. మూడ్రోజులు పాటు జరిగే అన్ని ముఖ్య కార్యక్రమాల్లో టీజీ వెంకటేష్ దంపతులు పాల్గొంటారని అర్చకులు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం ఎస్టీయూ ఆదోని, కౌతాళం మండలాల ఆధ్వర్యంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు, రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న, ఉపాధ్యాయులతో కలిసి గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకికి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అలసత్వం విడాలని సూచించారు. 2023 పిఆర్సి కమిషన్ నిర్మించక పోవడం వలన పీఆర్సీ మరింత ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 30శాతం ఐఆర్ ప్రకటించాలని 2022 పీఆర్సీ బకాయలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఆదోని మండల అధ్యక్ష, కార్యదర్శులు చింతకుంట రామకృష్ణ, సుధాకర్ బాబు,సూర్యుడు కౌతళం మండల నాయకులు అంజనేయ, రామాంజనేయులు, లక్ష్మన్న, మనోహర్, రాజేష్ తదితరులు ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ బి.శంకర్ శర్మ తెలిపారు. కర్నూలు ఇండోర్ స్టేడియంలో తైక్వాండో క్రీడాకారులకు శిక్షకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్టు ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి డాక్టర్.శంకర్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు బ్లాక్ బెల్టులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తైక్వాండో మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తైక్వాండోలో బ్లాక్ బెల్టు సాధించిన మహిళలు నలుగురు పురుషులను ఎదురించే ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉంటుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగాల్లో రిజర్వేషన్ అవకాశాలు కుడా వస్తాయని తెలిపారు. భారతదేశంలో అత్యంత ధనవంతుల్లో క్రికెట్ క్రీడాకారులు ఉన్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడల అభివృద్ధికి కృషి చేయడం శుభపరిణామం అన్నారు. పేద క్రీడాకారులకు ప్రభుత్వాలతో పాటు ధనవంతులు సైతం సహాయం చేయాలని కోరారు. ప్రపంచంలో అధిక జనభా ఉన్న భారతదేశం ఒలింపిక్ క్రీడల్లో పతకాలు తక్కువగా వస్తున్నాయని, క్రీడాకారులు ఎక్కువ పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు.

139వ మే డే జయప్రదం చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - కోడుమూరు : మే 1వ తేదీన కోడుమూరులో నిర్వహించే 139వ మేడే దినోత్సవ వేడుకలను వివిధ రంగాలలోని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు ఆధ్వర్యంలో డ్రైవర్స్ అసోసియేషన్ మండల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బి.రాజు, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి మద్దూరు రాముడులు హాజరయ్యారు. జీపు డ్రైవర్స్ అసోసియేషన్ మండల నాయకులు విష్ణు, గిడ్డయ్య, వెంకటేష్, సుభాన్, చిన్న, సురేష్, రఘు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా రీసర్వే చేపట్టాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - సి.బెళగల్: పైలెట్ గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా సమగ్రంగా చేపట్టాలని జిల్లా సర్వోన్నతాధికారి పి.రంజిత్ భాష రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం రీసర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండల కేంద్రంలోని గ్రామ పొలాల్లో జరుగుతున్న రీసర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేకి సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేశారా లేదా అని కలెక్టర్ ఏడీ సర్వేని అడిగి తెలుసుకున్నారు. రీసర్వేను పక్కాగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రోవర్ ద్వారా తీసుకున్న కోఆర్డినేట్ పాయింట్స్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, అక్కడే ఉన్న పొలం రైతులు మొల్దకల్ మరియు లింగన్నలతో మాట్లాడుతూ అధికారులు రీసర్వే నిర్వహించేటప్పుడు ముందుగా మీకు నోటీసులు ఇచ్చారా అని, మీ పొలంలో కొలతలు వేసే సమయంలో సర్వే అధికారుల వెంట మీరు ఉన్నారా అని అడుగుతూ మీకు ఏమైనా ఇబ్బందులు కలిగాయా అని కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా సర్వే సంచాలకులు మునికన్నన్, డీఎఫ్‌బీఐఓఎస్ విజయ కుమారి, కర్నూలు డివిజన్ అధికారి సుబ్బారెడ్డి, సిబెళగల్ మండల తహశీల్దార్ పురుషోత్తముడు, ఎంపీడీవో రాణెమ్మ, మండల సర్వేయర్ నాగభూషణం పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండల పరిధిలోని ఆరెకల్, నాగలాపురం గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ పాల్గొని ప్రసంగించారు. గర్భిణీలు, బాలింతలకు వెయ్యి రోజుల సంరక్షణలో భాగంగా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై వివరించారు. గర్భిణీ స్త్రీలు మొదటి రోజు నుండి పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తీసుకోవాల్సిన ఆహారం, టీకాలు, జాగ్రత్తలు, ఆరోగ్య పరీక్షలు,గంటలోపు ముర్రుపాలు, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని వివరించారు.

పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పురపాలక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరి చంద్ర యాదవ్, ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, ఎస్టీయూ పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవి, భీమరాజులు పలువురుతో కలిసి డీఈవో శామ్యుల్ పాల్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 3న విడుదల చేసిన తాత్కాలిక సీనియారిటీ లిస్ట్, 5న రివైజ్డ్ సీనియర్ లిస్టులో అభ్యంతరాలు తెలుపుతూ డిగ్రీ బీకాం, బయో టెక్నాలజీ వారిని సంబంధిత సబ్జెక్ట్ సీనియార్టీ లిస్టులో చేర్చాలని కోరారు. సీనియార్టీ లిస్టులో తప్పులు లేకుండా చూడాలని, పురపాలక పరిధిలో ఉన్నటువంటి హాఫ్ గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలో పోస్టులు మంజూరు పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, పాఠశాల కాంప్లెక్స్‌లో పునర్వ్యవస్థీకరణ జాబితా విడుదలపై అభ్యంతరాలు తెలుపుతూ ఆయా మేనేజ్మెంట్ పాఠశాలలను అదే మేనేజ్మెంట్లు పాఠశాలల్లో ఉండేటట్లు చర్యలు తీసుకోవా లన్నారు. తెలుగు పాఠశాలలను తెలుగు పాఠశాలల కాంప్లెక్స్‌లో, ఉర్దూ పాఠశాలలో ఉర్దూ కాంప్లెక్స్ పాఠశాలలో పరిధిలో ఉండేలా చూడాలన్నారు. లోక్యనాయక్, సుధాకర్, ఉరుకుందప్ప, ఖలీల్, రాముడు, రామయ్య, రంగారెడ్డి ఉన్నారు.

ఘనంగా చేనేత కార్మిక సంఘం వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కోడుమూరు : చేనేత కార్మిక సంఘం 90వ వార్షికోత్సవ వేడుకలను చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 90వ వార్షికోత్సవం పురస్కరించుకొని కర్నూలు జిల్లా కోడుమూరులో స్థానిక మెయిన్ బజార్‌లోని శీలప్ప కాంప్లెక్స్ వద్ద చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుగుడే మాధవస్వామి నేతృత్వంలో కార్మికులు ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుగిడే మాధవస్వామి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఉద్దేశించి మాధవ స్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆవిర్భవించి నేటికీ 89వ సంవత్సరం పూర్తి చేసుకుని 90లో అడుగుపెట్టిందని చెప్పారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో చేనేత కార్మికులందరూ పండగ వాతావరణంలో జెండాలను ఆవిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శ్రీరాములు, ఎస్ మహబూబ్ బాషా, మండల కార్యదర్శి అధ్యక్షులు ఎస్ నరసింహులు,డి వలి, సమితి సభ్యులు నభి,జి శంకర్,బి బాబు,సి గిడ్డయ్య,కే లక్ష్మన్న,కే రవి,బి వెంకటేశ్వర్లు,కేఎస్ గోపాల్,ఎస్ నాగరాజు,బి లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

బోయ లక్ష్మయ్య, తండ్రి బోయ గుంటెప్ప, పులిచెర్ల గ్రామం, కటారుకొండ పంచాయితీ, కృష్ణగిరి మం, కర్నూలు జిల్లా. దస్తావేజు నెం: 489/1995, సర్వే నెం: 95/2కు సంబంధించి ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలు ఇంటి నుండి వెల్దుర్తి బస్టాండు మోటారు సైకిల్ మీద వెల్తుండగా ఒరిజినల్ డాక్యుమెంట్స్ పడిపోయినవి. దొరికినయెడల సంప్రదించగలరు. సెల్ : 99089 67932

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 11, ఏప్రిల్ 2025

డ్రాప్ ఔట్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం అభినందనీయం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : బడి మానిన పిల్లలందరినీ తిరిగి పాఠశాలల్లో చేర్పించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్ స్పష్టం చేశారు. గురువారం పెద్దకడబూరు గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో మండల విద్యాధికారులు సువర్ణల సునీయం, రామమూర్తిల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలోని 26 గ్రామాల్లో ఉన్న బడి మానిన 85 మంది పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి పాఠశాలల్లో చేర్పించడంపై ప్రత్యేకంగా ఎంఈఓలను అభినందించారు. బడి మానిన పిల్లలను బడిలో తిరిగి చేర్పించడం ద్వారా బడి బయట ఉన్న పిల్లల సంఖ్య పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు సర్వేపల్లి విద్యార్థి మిత్రను, తల్లికి వందనం పథకాన్ని అందించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి సక్రమంగా పంపించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని కోరారు. ప్రిన్సిపాల్ రంగన్న, మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంజుమన్ ఆధ్వర్యంలో 12 జంటలకు సామూహిక వివాహం

- ఒక్కో వధువుకు 50 వేల నగదు చేక్కు బహుకరణ
- బంధుగణంతో కళకళలాడిన షాదిఖానా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల అంజుమన్ ఆధ్వర్యంలో 12జంటలకు స్థానిక అంజుమన్ షాదిఖానాలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిం చారు. అంజుమన్ అధ్యక్షులు హాజీ నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇమా ముల సంఘం అధ్యక్షులు హాఫీజ్ అమ్జద్ బాషా సిద్దీఖి, జమాతె ఇస్లామీ హింద్, నంద్యాల అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్, అంజుమన్ ఉపాధ్యక్షులు సి.అబ్దుల్ హఖ్, కార్యదర్శి జి.ముహమ్మద్ గౌస్, ఆర్.కే ఫంక్షన్ హాల్ యజమాని హిదాయతుల్లా, మున్నా, వధువరుల బంధు వులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖుద్దూస్ మాట్లాడుతూ అంజుమన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సామూహిక వివాహాలు చేస్తున్నామని, పేద ముస్లింలు నంద్యాలకు చెందిన వారు ముందుకు రావాలని, ప్రతి వధువుకు కానుకగా యాభై వేల నగదు చెక్కు ఇవ్వడం జరుగుతుందన్నారు. త్వరలో ముస్లిం పెద్దల సహకారంతో ఫురా?న్ ఖబరస్థాన్ ఆధునీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అమ్జద్, సమద్ మాట్లాడుతూ పేద వధువుకు రూ.50 వేలు ఇస్తున్నందుకు నంద్యాల ముస్లిం సమాజం తరుపున అంజుమన్ సంస్థను అభినందిం చారు. పదవ తరగతి పాసయిన 300 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు ఇవ్వటం అభినందనీయ న్నారు. మౌలానా అబ్దుల్లా, మౌలానా హాది, హాఫీజ్ అబ్దుర్రహమాన్ ఖాజీగా నిఖా నిర్వహించి ప్రార్థన చేసారు. అనంతరం వధువులకు చెక్కులు పంపిణీ చేసారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న భూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శివ రాముడు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పరిశీలించి ఎన్నో ఏళ్ల తర్వాత భూ రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. దాదాపు గ్రామాల్లో భూ రీసర్వే తో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ప్రజలు వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2024లో దాదాపు 27 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది పెసల బండ గ్రామాన్ని మొదటి పైలెట్ గ్రామంగా ఎన్నుకోవడం జరిగిందని గుర్తు చేశారు.రెండో ఫెస్ లో హానవాళు ,కడితోట గ్రామాలను రీసర్వేకు ఎన్నుకోవడం జరిగిందన్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రెవిన్యూ సదస్సులను ఏర్పాటు చేసి కొంతమేరకు పరిష్కారం చూపడం జరిగిందన్నారు.భూ రీసర్వే పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని,ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకొని భూవివాదాలకు స్వస్తి పలికే విధంగా కృషి చేయాలన్నారు.

12న జీ తెలుగులో డ్రామా జూనియర్స్

విశాలాంధ్ర - కర్నూలు: జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ 8 ఈ నెల 12న ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరాల నుంచి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ 8వ సీజన్‌తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పిల్లల్లో దాగున్న నటనా ప్రతిభను వెలికి తీసే ఉద్దేశ్యంతో కొత్త సీజన్ని ప్రారంభి స్తోందన్నారు. ఈ షోకు ఎనర్జిటిక్ యాంకర్ సుధీర్ హోస్ట్ చేయనుం డగా, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి రోజా న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. అనిల్ రావిపుడి జీ తెలుగు డ్రామా జూనియర్స్ 8 షో ద్వారా బుల్లితెరపై మొదటిసారిగా న్యాయనిర్ణేతగా వ్యవహ రిస్తున్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 8 గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ ముఖ్య అతిథులుగా ప్రముఖ నటులు జగపతి బాబు, ఆమని హాజరవుతారు. ఈ సీజన్లో పాల్గొనే చిన్నారులు రెండు జట్లు బాయ్స్ టీమ్, గర్ల్స్ టీమ్‌గా తలపడనున్నారు. గర్ల్స్ టీమ్‌కి యాంకర్ లాస్య, బాయ్స్ టీమ్‌కి త్రినయని సీరియల్‌తో జీ తెలుగు ప్రేక్షకులను అలరించిన నయని మెంటర్లుగా వ్యవహరిస్తున్నారు.

రెండో బహుమతి అందజేసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని పసుపుల గ్రామంలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సంబరాలలో భాగంగా రాష్ట్ర అంతరాష్ట్రస్థాయి వృషభరాజములు బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ బహుమతులలో రెండవ బహుమతి 40,000 రూపాయలు అందజేసిన టిడిపి యువ నాయకులు బత్తుల నారాయణరెడ్డి, సంగు శంకేశ్వర్ రెడ్డి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామనవమి పండుగ సందర్భంగా గ్రామంలో రైతులు,గ్రామ స్తులందరు కలిసికట్టుగా రైతు సంబరాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషకర విషయం అన్నారు. అనంతరం రైతు సంఘం నాయకులు బహుమతి ప్రధానం చేసినందుకు యువ నాయకులు శంకేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమం టీడీపీ నాయకులు భూషణ్, కృష్ణ నాయక్, షేక్షవలి, బాల నాయుడు, కామేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాయితీతో మీ ఇంటిపై సోలార్

విశాలాంధ్ర - బనగానపల్లె : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలని మండలంలోని పాతపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ బెడదల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పాతపాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించి సోలార్ విద్యుత్‌పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణయ్య, ఈఓపిఆర్డి బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, డిఈ మదిలేటి, ఏఈ శ్రీనివాసులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

విశాలాంధ్ర - వెలుగోడు : ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశం కొరకు ఆదివారం జరిగే పరీక్షను సోమ వారంకు వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులంతా 21వ తేదీ ఉదయం పరీక్షకు హాజరు కాగలరని ప్రిన్సిపాల్ అన్నారు.

లోకకల్యాణార్థం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహా క్షేత్రంలో లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సర్కారీ సేవగా నందీశ్వరునికి దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలను అర్చక స్వాములు సాంప్రదాయ పద్ధంగా నిర్వహించారు. శ్రీశైలక్షేత్రంలో పరివార దేవత మూర్తులను ప్రత్యేకంగా ఆయా దేవతామూర్తులకు ఇష్టమైన తిథి వార నక్షత్రపు రోజుల్లో పూజించటం వల్ల శ్రీశైలం వచ్చే భక్తుల కోరికలు త్వరితగతిన తీరటంతో పాటు ఆధ్యాత్మిక భావన క్షేత్ర అభివృద్ధి భక్తుల్లో భక్తి భావాలను పెంపొందించేందుకు దేవస్థానం వారు సర్కారీ సేవగా ఈ సేవలను నిర్వహించారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులు కృషి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో మాదక ద్రవ్యాల సమూల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సహకరించి పటిష్ట చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబ నన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీతో నిర్వహించిన సమావేశంలో అధికారులకు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల అధికా రులు సహకరిం చాలని, మాదకద్రవ్యాల నివారణ, రవాణాను అరికట్టేందుకు ప్రణాళికా బద్ధంగా సమన్వ యంతో పని చేయాలన్నారు. జిల్లాలోని విద్యా సంస్థల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాలపై విస్తృత అవగాహన కల్పిం చాలన్నారు. ప్రతి కాలేజీలో మాదకద్రవ్యాల నియం త్రణకు ఒక కమిటీని ఏర్పాటు చేసి అది ప్రణాళికా బద్ధంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నిద్ర మాత్రలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కమిటీలోని వైద్య అధికారులు డ్రగ్స్ కంట్రోల్ వారిని కోరారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయిం చిన, రవాణా చేసిన వారి సమాచారం వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పురపాలక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్క రించాలని కోరుతూ గురువారం ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరి చంద్ర యాదవ్, ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, ఎస్టీయూ పట్టణ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు రవి, భీమరాజులు పలువురుతో కలిసి డీఈవో శాముల్ పాల్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 3న విడుదల చేసిన తాత్కాలిక సీనియారిటీ లిస్ట్, 5న రివైజ్డ్ సీనియర్ లిస్టులో అభ్యంతరాలు తెలుపుతూ డిగ్రీ బీకాం, బయో టెక్నాలజీ వారిని సంబంధిత సభ్జట్ సీనియార్టీ లిస్టులో చేర్చాలని కోరారు. సీనియార్టీ లిస్టులో తప్పులు లేకుండా చూడాలని, పురపాలక పరిధిలో ఉన్నటువంటి హాఫ్ గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలో పోస్టులు మంజూరు పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని, పాఠశాల కాంప్లెక్స్‌లో పునర్వ్యవస్థీకరణ జాబితా విడుదలపై అభ్యంతరాలు తెలుపుతూ ఆయా మేనేజ్మెంట్ పాఠశాలలను అదే మేనేజ్మెం ట్లు పాఠశాలల్లో ఉండేటట్లు చర్యలు తీసుకోవా లన్నారు. తెలుగు పాఠశాలలను తెలుగు పాఠశాలల కాంపె ్లక్సలో, ఉర్దూ పాఠశాలలో ఉర్దూ కాంప్లెక్స్ పాఠశాలలో పరిధిలో ఉండేలా చూడాలన్నారు. లోక్యనాయక్, సుధాకర్, ఉరు కుందప్ప, ఖలీల్, రాముడు, రామయ్య, రంగారెడ్డి ఉన్నారు.

90వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు: రైతు సంఘం 90వ ఆవిర్భావ దినోత్సవం ను జయప్రదం చెయ్యాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పిలుపు నిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్ నందు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపనగౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 1936 ఏప్రిల్ 11న ఏర్ప డిందని, అప్పుడు జాతీయ అధ్యక్షులుగా సహజానంద సర స్వతి ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎన్జీరంగా ఉన్నారని, అప్ప ట్లో అఖిలభారత రైతు సంఘం మన భారత దేశంలో దున్నేవాడికి భూమి హక్కు కావాలని ఎన్నో పోరాటాలు నిర్వహించి భూమిలేని నిరుపేదలకు భూములు పంచడం జరిగిందన్నారు. దేశంలోని ప్రైవేట్ బ్యాంకులన్నీ జాతీయ చేయడం జరిగిందని, భూమి ఉన్న ప్రతి రైతుకు పంట రుణాలు ఇవ్వడం రైతులందరికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దేశవ్యాప్తంగా పోరాటాలు చేయడం వల్లనే వ్యవ సాయానికి సాగునీరు గ్రామాలకు తాగునీర, సాగునీటి ప్రాజెక్టులు కొంతవరకు సాధించడం జరిగిందన్నారు. ప్రస్తుతం దేశంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందని, వ్యవసాయం గిట్టుబాటుగాక రైతులు వ్యవసాయాన్ని వదిలి వలస కూలీలుగా మారుతున్నారన్నారు. సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి చింతల మహేష్, రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన న్యాయమూర్తి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: గూడూరు మండల పరిధిలోని పెంచికలపాడు నందుగల విశ్వభారతి జనరల్ ఆసుపత్రిలోని మానసిక దివ్యాంగుల విభాగాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేయడం చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మానసిక వికలాంగుల సంక్షేమం కొరకు, వారికి న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యు ఎం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

కల్లూరు మండలం పెద్దపాడులోని దామోదరం సంజీయయ్య బాల సదన్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో బాలల సంక్షేమం కొరకు, వారికి న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యూఎం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ నందు గల కీర్తన అనాథ ఆశ్రమాన్ని తనిఖీ చేయడం జరిగింది. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో తనిఖీ చేపట్టారు. ఆశ్రమంలోనీ నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మనోనా కమిటీ సభ్యులైన వెంకట హరినాథ్, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, శివరాం, డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్, రాయపాటి శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటీర్‌లు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో వైభవంగా గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక కృష్ణానగర్ లోని సర్వేపల్లి విద్యాసంస్థల యందు ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ పి.శేషన్న ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. దీక్షిత్ గౌరవ అతిథిగా విచ్చేసి విద్యార్థులను తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేపీ అరుణశ్రీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శరణ బసవేశ్వరుడి పురాణ ప్రవచనం ప్రారంభం

విశాలాంధ్ర- హొళగుంద: సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో గురువారం సాయంత్రం 6:30 గంటలకు స్వామివారి పురాణ ప్రవచ నాన్ని కోట్టూరు మఠం పీఠాధిపతి మరి రాజు స్వామి ప్రారంభించారు. సిద్దేశ్వర స్వామికి వంశపారంపర్య ఆలయ ధర్మకర్త రాజ పంపను గౌడ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కలబురిగి శరణ బసవేశ్వర పురాణ పుస్తకాన్ని భజనలు చేస్తూ ఈశ్వర సేవా సమితి, సిద్దేశ్వర భజన మండలి భజనలు చేస్తూ పురవీధుల్లో ఊరేగిస్తూఆలయం వరకు చేరుకున్నారు. పురాణ ప్రవ చనం సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. వేరే ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త రాజ పంపను గౌడ తెలిపారు. 17న కాశీ జగద్గురు అడ్డపల్లకి మహోత్సవం, 18న ఇష్ట లింగ పూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. కలబురిగి శరణ బసవేశ్వరుని పురాణ ప్రవచనం ఈ నెల 30 వరకు కొనసాగుతుందని పురాణ ప్రవచనానికి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజా వంపన్న గౌడ, శివ శంకర గౌడ, సిద్ధార్థ గౌడ, సిద్దేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు కొట్రేష్, డాక్టర్ జగదీష్, సిద్ధప్ప, మలకప్ప, అమరప్ప, డిష్ మంజు, జాంటీ వీరేష్, జీజీ బసవరాజ్, గవిలు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్ విజేత ఆదోని జట్టు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పెద్దకడ బూరు గ్రామ శివారుల్లో వెలసిన శ్రీ ఫకీర్ సాబ్ హాజీమలంగ్ బాబా షరీఫ్ ఉరుసు మహోత్సవం సందర్భంగా దర్గా ధర్మకర్త బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ తాలూకా స్థాయి పోటీల్లో విజేతగా ఆదోని శ్రీ రామలింగేశ్వర జట్టు నిలిచింది. గురువారం ఆదోని శ్రీ రామలింగేశ్వర, సింగరాయనహళ్లి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. సింగరాయనహళ్లి జట్టుపై ఆదోని శ్రీ రామలింగేశ్వర జట్టు 7 పాయింట్ల ఆధిక్యతతో విజయం సాధించి ప్రథమ బహుమతి సాధించింది. సింగరాయనహళ్లి జట్టు ద్వితీయ బహుమతితో సరిపెట్టుకుంది. తృతీయ స్థానంలో పెద్దకడబూరు జట్టు నిలిచింది. కబడ్డీ టోర్నమెంట్ తాలూకా స్థాయి పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు దర్గా ధర్మకర్తలు బాబు, నరసింహులు, రాముడు శుక్రవారం ఫకీర్ సాబ్ హాజీమలంగ్ బాబా షరీఫ్ ఉరుసు మహోత్సవంలో అందజస్తారని ఆర్గనైజర్లు రమేష్, రంగస్వామి, భీమేష్, రమేష్ తెలిపారు.

అసత్య ప్రచారాలను మానుకోవాలి : ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : మాజీ ముఖ్య మంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి తనకు భద్రత సరిగా కల్పించడం లేదని చెప్పడం సిగ్గుచేటని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు ఎంపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా రాప్తాడు పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిన భద్రత సరిగా లేదని పోలీసులను విమర్శలు చేయడం సరికాదన్నారు. అసత్య ప్రచారాలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మానుకోవాలని ఎంపీ హితవుపలికారు. గత ప్రభుత్వంలో ప్రతి పక్ష నాయకులకు ఎలాంటి భద్రత కల్పించలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి పర్యటనలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తున్న జగన్మోహన్ రెడ్డి విమర్శలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకట రాముడు టీడీపీ నాయకులు వలి, దేవ శంకర్, నాగేష్ పాల్గొన్నారు.